# ఆర్టీసి బస్సులో మంత్రి ప్రయాణం

**-మహిళా ప్రయాణికులతో మంత్రి ముచ్చట**



**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** నగరంలో ప్రజల మధ్యకు వెళ్లి ప్రత్యక్షంగా వారి అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు బస్సులో సాధారణంగా టికెట్ తీసుకొని ప్రయాణించారు. పంజాగుట్ట నుంచి లక్డిక పూల్ వరకు బస్సు ప్రయాణం చేస్తూ, వారు ఇతర ప్రయాణికులతోపాటు మహిళలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఉద్యోగానికి వెళ్లే మహిళలు, అవసరాల నిమిత్తం ప్రయాణించే వారు ఈ పథకంతో ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడిన మంత్రి, వారి అభిప్రాయాలను స్వయంగా వినడంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలు కూడా ఉచిత ప్రయాణం పథకం వల్ల నెలకు ఎంతో డబ్బు ఆదా అవుతోందని, అది తమ కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఎంతో తోడ్పడుతోందని తెలియజేశారు. మునుపెన్నడూ లేని విధంగా మహిళలకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తున్నదని చెప్పారు. నగర రవాణా వ్యవస్థపై మాట్లాడిన మంత్రి, ఇటీవలే నగరంలో పెద్ద మొత్తంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంతేగాక, ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేరువగా ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో పాటు, మహిళా సంఘాలను ఆర్థికంగా చురుకుగా మార్చే లక్ష్యంతో అనేక ప్రత్యేక పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చినదని మంత్రి వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యయమని స్పష్టంగా తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. వారి సమస్యలను గౌరవప్రదంగా పరిష్కరిస్తూ, రవాణా సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రయాణం ద్వారా మంత్రి, ఇతర నాయకులు ప్రజల మధ్యకు వెళ్లి వారి జీవితాల్లో మార్పు తెస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రత్యక్షంగా చూశారు.



హైదరాబాద్ వార్త



# త్రివర్ణ శోభితం

**-మువ్వన్నెలతో మురిసిన సాగరతీరం -ట్యాంక్‌బండ్‌పై భారీగా తిరంగా ర్యాలీ**





**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త**

దేశభక్తి ఉప్పొంగింది. జాతీయతా భావం వెల్లివిరిసింది. ఐక్యతా రాగం విరాజిల్లింది. మహానగరం మువ్వన్నెల జెండా మురిసిపోయింది. భారత్ మాతకీ జై నినాదాలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు మార్మోగాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని, మన దేశ సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన తిరంగా ర్యాలీ త్రివర్ణ శోభితమైంది. నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు తిరంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో సమాజంలోని అన్ని వర్గాల పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రిటైర్డు ఆర్మీ అధికారులు, డాక్టర్స్, న్యాయవాదులు, టీచర్స్, మహిళా సంఘాలు, బ్రాహ్మ కుమారీస్, నగరంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పార్టీలకు అతీతంగా నేతలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్, ఎంపిలు డికె అరుణ, జి.నగేష్, బిజెపి శాసనసభాపక్ష నాయ కుడు ఎలేటి మహేశ్వర్‌రెడ్డి, సినీనటుడు బెల్లం కొండ శ్రీనివాస్, ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణ మాదిగ, డాక్టర్ గౌతంరావు, లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

**మంద కృష్ణ మాదిగకు కాలికి గాయం..**

ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన తీరంగా ర్యాలీలో తోపులాట జరగడంతో ఎమ్మార్పిస్ అధినేత మంద కృష్ణ మాదిగకు కాలుకి గాయం అయ్యింది. వెంటనే అతని ర్యాలి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా కొద్దిరోజుల కిందటనే కాలికి అయినా మేజర్ గాయం కొలుకున్న ఆయనకు మళ్లీ అదే కాలికి గాయం అయినట్లు అనుచరులు తెలిపారు.

# చెరువుల్లో మట్టిపోస్తే కఠిన చర్యలు

**-శిఖం భూమిలో అయినా సడలింపు లేదు -బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లకు హైడ్రా హెచ్చరిక**

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోస్తే కఠిన చర్యలు ఉంటాయని హైడ్రా హెచ్చరించింది. చెరువులపై నిరంతరం నిఘా ఉంటుదని మట్టి పోసిన వారిని సాక్ష్యాధారాలతో పట్టుకుని వారిపై క్రిమినల్ కేసులు పెడతామని పేర్కొంది. ఈమేరకు శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టరలతో పాటు ఆయా సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టు నిర్వాహాకులు కలిసి మట్టిఎక్కడ పోయాలో ముందుగానే అవగాహనకు రావాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు మిగులుతాయని దగ్గరల్లోని చెరవుల ఒడ్డున పడేస్తామంటే వారి వాహనాలు సీజ్ చేయడమేకాకుండా డ్రైవర్, వాహన యజమాని, మట్టిని ఎక్కడి నుంచి తెస్తున్నారో సదరు నిర్మాణ సంస్థ యజమానిపై కూడా క్రిమినల్ కేసులు పెడతామన్నారు. శిఖం భూములల్లో కూడా మట్టి నింపకూడదని సూచించారు. హైడ్రా పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇందులో కేసులు నమోదు అవుతాయన్నారు. చెరువుల వద్ద కూడా 24గంటలూ నిఘా ఉందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

### ఈ నంబరుకు ఫోను చేయండి..

చెరువుల్లో మట్టిపోసి నింపుతున్న వారి సమాచారాన్నివ్వాలని నగర ప్రజలను హైడ్రా కోరింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఫోను నంబరు 9000113667 కేటాయించింది. హైడ్రా ట్విట్టర్ అకౌంట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అలాగే చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జేసీబీల వీడియోలను కూడా పంపించాలని సూచించింది. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు. కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ ఈ క్రతువులో చేతులు కలపాలని హైడ్రా కోరింది.

# ట్రాఫిక్ నివారణకు ఫ్లైఓవర్లు అండర్‌పాస్‌లు నిర్మాణం

**-అభివృద్ధి పనులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి**

**-వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**-అధికారులకు జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆర్.వి కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** నగరంలో ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలు చేపడుతున్నామని అభివృద్ధి పనులకు కావాల్సిన భూసేకరణ పక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోన్‌రెడ్డి, కమిషనర్ ఆర్.వి కర్ణన్‌లతో కలిసి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా ఎస్.ఆర్.డి.పిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అలాగే ఫలక్‌నూమా ఆర్ ఒబి పనులను జులై వరకు శాస్త్రిపురం ఆర్‌వోబి ఆగస్టు వరకు పూర్తి చేయాలని ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. అలాగే వర్షాకాలంలో వాటర్ లాగింగ్ పాయింట్ ల వద్ద నీటి నిలువ కుండా మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, ప్రధాన రోడ్డు మీద కాకుండా అంతర్గత రోడ్ల పైన కూడా నిలిచే అవకాశం ఉన్నందున అక్కడ కూడా మొబైల్ స్టాటిక్ బృందాలను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు అలాగే నూతనంగా ఏర్పడిన కాలనీలో శానిటేషన్ పై దృష్టి సారించాలని, అవసరమైతే శానిటేషన్ వర్కర్ లను ఏర్పాటు చేయాలన్నారు. చెత్త కనపడినా, వీధి లైట్లు వెలగ పోయిన బాధ్యుల పై చర్యలు తప్పవని అలాగే మధ్యాహ్నం పూట వీధి లైట్స్ వెలగ కుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ జనాభాలో సుమారు 30 శాతం మంది హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నందున, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాల మీద దృష్టి పెట్టి, సన్న బియ్యం పంపిణీ, ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పథకాలు అమలు చేస్తోందన్నారు. జీహెచ్ఎంసీ అధికారుల పనితీరు మెరుగుపరచాలని, ప్రతి సమస్యను సమయోచితంగా పరిష్కరించేలా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే జీహెచ్ఎంసీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, రఘు ప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రాజెక్టు సిఈ భాస్కర్ రెడ్డి, మెయింటేన్స్ సిఈ సహదేవ్ రత్నాకర్, సిసిపి శ్రీనివాస్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, ఈఈ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# నిమ్స్ విస్తరణ పనులు వేగవంతం చేయండి

**-నిర్దేశించిన సమయంలోపు నిర్మాణం పూర్తి చేయాలి**

**-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం**



అధికారులతో కలిసి నిర్మాణపనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో చేపట్టిన పనుల వివరాలు, పురోగతి పై జిల్లా కలెక్టర్ సమక్షించారు. బ్లాక్‌ల వారీగా జరుగుతున్న పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్అండ్‌బి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 19.54 ఎకరాలలో26,19, 209 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 1698 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు డిసెంబర్ 2026 నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యం నిదేశించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్స్ విస్తరణ ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన పురోగతిపై సి.ఎం ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని నిర్మాణ పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో సమీక్షించాలని సి.ఎం తెలిపారన్నారు. పనుల వేగం పెంచుటకు అవసరమైతే అధికంగా కూలీలను తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణాన్ని నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేసేందుకు అధిక మొత్తంలో లేబర్‌ను నియమించడంతోపాటు ఎక్కువ మిషనరీ సమకూర్చుకోవాలని సూచించారు, ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా కొరకు ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో చర్చించారు. అలాగే రహదారి నిర్మాణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి కేటాయించిన స్థలానికి సత్వరమే హద్దులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పనుల పురోగతిపై ప్రతివారం సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఆర్అండ్ బి ఎస్ సి నర్సింగరావు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెగా డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఆర్అండ్‌బి ఈఈ విశ్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జలాల్ బాబానగర్‌లో దారుణం

**-డెలివరి బాయ్‌పై బ్లేడ్‌లతో దాడి**

**-డబ్బులు, ద్విచక్రవాహనం లాక్కొని పరారైన దుండుగులు**

**అత్తాపూర్ మే17, ప్రభాతవార్త :** నజీమ్ అనే డెలివరీ బాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడ్‌లతో దాడి చేసి దోచుకొనే పరారైయ్యారు. ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దుండగులు నకిలీ ఆర్డర్ ఇచ్చి డెలివరీ బాయ్‌ను రప్పించారు. అతను అక్కడికి రాగానే, అతని కళ్లల్లో స్ప్రే కొట్టి, బ్లేడ్‌లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న ఫోన్, ద్విచక్రవాహనం, డబ్బులు లాక్కొని పరారయ్యారు. ఈ దాడి గంజాయి బ్యాచ్ పనే అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దాడికి గురైన డెలివరీ బాయ్ "కాపాడండి! కాపాడండి!" అని పెద్దగా అరవడంతో, స్థానికులు అటువైపు వస్తున్నారని గమనించిన దుండగులు వెంటనే అక్కడి నుండి పారిపోయారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గాయాలతో బాధపడుతున్న డెలివరీ బాయ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతం ఎప్పుడూ చిమ్మచీకటిగా ఉంటుందని, తరచుగా ఇలాంటి దారిదోపిడీలు జరుగుతున్నాయని వారు వాపోతున్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వెంటనే వారిని అరికట్టాలని స్థానికులు పోలీసులను వేడుకుంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఫార్మ డి డాక్టర్స్‌కు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలి



మహాధర్నాలో పాల్గొన్న ఫార్మ డి డాక్టర్స్ నిరుద్యోగులు

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫార్మ డి డాక్టర్స్ కోర్సు పూర్తి చేసిన 80 వేల మంది నిరుద్యోగులకు ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది నిరుద్యోగులు శనివారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టారు. ప్రభుత్వం తమ గోడును పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శీలం వెంకట్, డాక్టర్ కుంచం మహాలక్ష్మి మహాధర్నాలో హెచ్చరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని 267 ఫార్మ డి డాక్టర్స్ కళాశాలల నుంచి ప్రతి ఏడాది 7 వేల మంది బయటకు వస్తున్నారని, 2008లో ప్రారంభమైన ఈ కోర్సులో ఇప్పటివరకు 70 వేలకు మందికిపైగా కోర్సుల పూర్తి చేశారని, అయితే ప్రభుత్వాలు ఇప్పిటి వరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఉద్యోగాల కోసం 70 వేల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని పలు మార్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు విజ్ఞప్తి చేసినా ఏలాంటి స్పందన లేదని వారు ఆరోపించారు. సిఎం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గుంతలమయంగా రహదారి



గుంతలు మయంగా మారిన ఘాన్సీ బజార్ ఝూలా రహదారి

**చార్మినార్, మే 17 ప్రభాతవార్త :** పాతబస్తీ ఘాన్సీ బజార్‌లోని ఝూలా రహదారి చెడిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్డుపై కంకర రాళ్లు తేలటంతో ప్రజలు నడిచి వెళ్లే సమయంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జిహెచ్ఎంసి అధికారులకు గుంతలు మయంగా మారిన ఝూలా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు వినతి చేసినప్పటికి ఎటువంటి ఫలితం లేకపోయింది. ప్రతీ రోజు వందలాది మంది భక్తులు ఝూలాలోని శ్రీ రాణి సతీదాది మందిరానికి పూజలు నిర్వహించటానికి వెళుతుంటారు. గుంతలలో భక్తులు జారిపడి గాయాల పాలవుతున్నారు. రెండు సంవత్సరాలు నుంచి ఈ రహదారికి మరమ్మతులు చేయకపోవటం తో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. రాత్రి వేళల్లో చీకటిలో రోడ్డు వెంబడి నడిచి వెళ్లాలంటేనే ప్రజలు సందేహిస్తున్నారు. జిహెచ్ఎంసి అధికారులు పట్టించు కోకపోవటం పట్ల ఝూలా ప్రాంతం వాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్‌లోని ఝూలా రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నవరసభరితం విష్ణువిలాసము కూచిపూడి నాట్యహేల

**రవీంద్రభారతి, మే 17 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భక్తి, ధర్మాచరణలతో ప్రతీమనిషి మాధవత్వం వైపు మరలుగాక అనే నినాదం, సదాశయంతో నవరసభరితంగా ప్రదర్శింపబడిన విష్ణువిలాలము ఆహుతులైన అశేష ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకొని మంత్రముగ్ధులను చేసింది. ముందుగా కూచిపూడి నృత్యశైలిలో ప్రముఖ నాట్యగురువులు కె. మాధవరావు, సిరి రాజ్‌కుమార్‌ల నేతృత్వంలో పలువురు కళాకారిణులు కూచిపూడి నృత్యశైలిలో విష్ణు విలాసము అద్భుతంగా ప్రదర్శించగా; వినూత్నరీతిలో అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, మొల్ల, పోతన, ఘంటసాల వైకుంఠంలోని లక్ష్మీనారాయణుల సన్నిధిలో విష్ణువిలాసము పేరిట గానం చేస్తే ...పేరిట ప్రదర్శించి ఆహ్లాదపరిచి అందరి ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా పిఎంకె.గాంధీ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి, నగర ట్రాఫిక్ అదనపు డిసిపి రాందాస్ తేజావత్, దైవజ్ఞశర్మ, కె.బి.శ్రీధర్, మహేశ్చంద్ర భరద్వాజ్, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొని ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులందరినీ ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. చివరిగా చేయూత ఫౌండేషన్ డా. కె.పి.కామేశ్వరరావు పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు.



విష్ణువిలాసము కూచిపూడి నాట్యహేలలో ఒక దృశ్యం

## పేదలకు సీఎం సహాయనిధి వరం : ధనరాజ్ యాదవ్


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, మే 17, ప్రభాతవార్త**
సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంజూరు చేయించిన సీఎం సహాయనిధిని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులు కృష్ణ గౌడ్, అర్జ వెంకట శేషమ్మలకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని అన్నారు. అనారోగ్య బాధితులు సీఎంఆర్ ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో రోడ్డు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, మే 17, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని క్రాంతి నగర్‌లో సీసీ రోడ్ పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో బస్తి వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి. ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి 54,00,000 మంజూరు చేయించారు. శనివారం మంజూరు అయిన నిధులతో రోడ్డు పనులను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, విలీది అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బల్ రెడ్డి, టీపీసీసీ లెబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్సింగ్ రావు, 1వ డివిజన్ అధ్యక్షులు రాజి రెడ్డి, జనరల్ సెక్రటరీ నవీన్ కుమర్, జి వి రెడ్డి, బుగ్గ రెడ్డి, శ్రీధర్, రాజ సుర, రాఘవేందర్ రెడ్డి, కృష్ణ చైతన్య, జగన్, జి కోటేశ్వర్ రావు, నర్సింహులు, పి సురేష్, ఎస్ ఎల్ వి నరేష్, కిషోర్, శ్రీపతి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గొంగుల జిత్తు, హరియా నాయక్, దయాకర్ రెడ్డి, సంజీవ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి పూజలో కూన శ్రీశైలం గౌడ్


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, మే 17, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని హనుమాన్ దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుమారుని హనుమాన్ మాలధారణ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ శ్రీ ఆంజనేయ స్వామివారి పూజలో పాల్గొన్నారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ హనుమాన్ మాలధారణలో ఉన్న స్వాములతో కలిసి శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి వారికి పాలాభిషేకం, పూలహారాలు స్వాముల భజన మంత్రాల మధ్య శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న నర్సులు, హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది

**పేట్ బషీరాబాద్, మే 17, ప్రభాతవార్త**
కొంపల్లిలో రెనోవా హాస్పిటల్స్ డాక్టర్ శ్రీధర్ పెద్దిరెడ్డి, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగుల పట్ల అంకితభావంతో సేవలందిస్తున్న నర్సులను ఘనంగా గౌరవించారు. వారి సేవలు ఎంతో విలువైనవని ప్రశంసించారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ వైద్య సిబ్బందికి రెనోవా హాస్పిటల్స్ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. నర్సులు స్వయంగా సంప్రదాయ నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, ప్రదర్శించారు. ఈ సందర్భంగా డా. రాధాకృష్ణ రావు సాగి, సీఈఓ, రెనోవా మిడ్ లెవల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ మాట్లాడుతూ నర్సులు ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక వంటివారని, వారి సంక్షేమం మాకు అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. ప్రతి రోగికి అత్యుత్తమమైన వైద్యం అందించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. కె. కృష్ణ మోహన్, డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్ సర్జన్, డా. ఎస్. శ్రీనాథ్, డైరెక్టర్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్, డా. అరుణ్ దేవ్, సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, డా. నితిన్ రెడ్డి, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, డా. మహాదేవ్, సీనియర్ జనరల్ మేనేజర్, ఇతర వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

## రంగం చెప్పే స్వర్ణలతకు డబుల్ బెడ్‌రూమ్ పట్టా అందజేత

**కంటోన్మెంట్, మే 17 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ ఉజ్జాయిని మహంకాళి ఆలయంలో రంగం చెప్పే స్వర్ణలతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. ఆమే ఆర్థిక పరిస్థితి గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మీలు స్వర్ణలతకు ఇంటి పట్టాను అందజేశారు. ఆమే కోరుకున్నట్లుగానే మారేడ్‌పల్లిలోనే ఇంటిని కేటాయించారు. అద్దె ఇంట్లో ఇబ్బందులు పడుతున్న ఆమేకు ప్రభుత్వం ఊరటనిచ్చింది.

## నిజాంపేట్‌ను మోడల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నిజాంపేట్, మే 17, ప్రభాతవార్త**
బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజాంపేట్ కార్పొరేషన్ ను మోడల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్, 17వ డివిజన్ కౌసల్య కాలనీ, 18వ సాయి అనురాగ్, 20వ డివిజన్లలోని పూజిత ఎంక్లేవ్ కాలనీల లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు, నూతన కాలనీల వాసులు కాలనీలలో నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు, వీధి దీపాలను, పొల్యూషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తగా వెలుస్తున్న కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి 2023 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజానీకానికి రుణపడి ఉంటానన్నా


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

రు. రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, రాఘవేంద్ర రావు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, మున్సిపల్ డిఈ యూనస్, ఏఈ ప్రవీన్ కుమార్, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్ర మోహన్, మేనేజర్ సౌమ్య, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకృతా రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాశ్, నాయకులు బొర్రా చందు, ప్రదీప్, సాంబశివారెడ్డి, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో మార్మోగుతున్న చిక్కడపల్లి వీధులు

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సమస్త వాహనాలలో సర్వశ్రేష్ఠమైంది గరుడవాహనం. గరుడ వాహనంపై ఊరేగే స్వామి వారిని దర్శించుకుంటే.. ఈతి బాధల నుంచి ఉపశమనం లభిస్తుందని విశ్వాసం. అత్యంత కీలకమైనదిగా భావించే గరుడ వాహన సేవలో శ్రీనివాసుడు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల కన్నులకు ఆనందం కలిగిస్తూ మాడవీధుల్లో దేదీప్యమాన కాంతులతో గరుడ వాహనంపై శ్రీవారు కొంగు బంగారంగా భక్తులను అనుగ్రహించారు. ఈ సేవను వీక్షి ంచడానికి వచ్చిన భక్తులతో మాడవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఎటువైపు చూసిన గోవిందా గోవిందా అనే నామస్మరణం వినిపిస్తోంది. గరుడ సేవకు అత్యధికంగా భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఆలయం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాంచరాత్రాగమ శాస్త్రోను సారంగా క్షేత్రసాంప్రదాయంగా అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్-కీర్తి దంపతులు, ఈవో, సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో జపహోమ, పూజ, అర్చనాది సేవలతో ధార్మిక ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన సేవకు విశిష్ట స్థానం.. స్వామివారిని దర్శిస్తే భాదల నుంచి విముక్తి లభిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ వాహన సేవల్లో పాల్గొనే భక్తులు శ్రీవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతారని, సకల పాపాలు తొలగిపోతాయని. జ్ఞానం లభి


వాహనసేవలో పాల్గొన్న భక్తులు, ఆలయం నిర్వాహకులు

స్తుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాల్లో భాగంగా మహానివేదన, మంత్రపుష్పం పూర్తయిన తర్వాత వేదపారాయణము, ద్రావిడ ప్రబంధము భేరిపూజ, మహానివేదన అనంతరం వాహన సేవ జరిగింది.

**నేడు రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవం**
కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడి రథోత్సవ ఊరేగింపు సేవ ఉంఉందని ఆలయం అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ వివరించారు. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందె తీర్థము, హవనము, బలిహరణం, బాలభోగము, మంత్రపుష్పము, పల్లకీసేవ, మహానివేదన, వేదపారాయణాలు, ద్రావిడ ప్రబంధము ఉంటుంది. సాయంత్రం మహానివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం అనంతరం రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవంఉంటుంది.

## గొప్ప ఆధ్యాత్మిక గ్రంథం 'శ్రీమాలిక' : ఎమ్మెల్సీ సురభివాణిదేవి

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** పరమ ఋషుల అమృత రసధారల్ని మహాశక్తులు నిండిన అక్షరాలుగా పరమాద్భుత వ్యాఖ్యానాలతో పవిత్ర గ్రంథాలను తెలుగు వారికి అందిస్తున్న ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ ధన్యజీవులని తెలంగాణ శాసనమండలి సభ్యురాలు, శ్రీ వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ చైర్ పర్సన్ సురభి వాణీదేవి అన్నారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత , శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ అద్భుత రచనా సంకలనం 'శ్రీమాలిక' నాలుగు వందల పేజీల ప్రత్యేక గ్రంథం పదహారవ పునర్ముద్రణ ఆవిష్కరణ సభ గానసభ నిర్వాహణలో అధ్యక్షుడు కళావి ఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ గ్రంథాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సురభీవాణిదేవి ఆవిష్కరించి ప్రసంగించారు. శనివారం సాయంకాలం త్యాగరాయగానసభలో ఆమె ఆవిష్కరించారు. శ్రీమాలిక గ్రంథంలో నృసింహావిర్భావఘట్టం చదువుతుంటే వొళ్ళు గగుర్పొడిచిందని , తిరుమల సొగసులు నిండిన ఈ అపురూప గ్రంథం శ్రీనివాస్ జీవన వైభవంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. వ్యాపార కాలుష్యం లేకుండా పవిత్రతలు నిండిన అఖండ గ్రంధాలు అందించడంలో పురాణపండ శ్రీనివాస్ ప్రథములు అని అన్నా


పురాణపండ శ్రీనివాస్ రచనా సంకలనం 'శ్రీమాలిక' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభీవాణిదేవి

రు. ఈ మంగళ ఉద్యమానికి సహకరిస్తున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి, డాక్టర్ కెవి.రమణాచారి కిమ్స్ హాస్పిటల్స్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య , అమృతేశ్వర ఆలయం చైర్మన్ సాయి కొర్రపాటి లకు జనార్దనమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీమాలిక గ్రంథ తేజస్సు వెనుక ఉన్న తిరుమల లావణ్యం, తిరుమలేశుని అనుగ్రహం గురించి గ్రంథ రచయిత పురాణపండ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయగానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

## 20న సెంట్రల్ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.డి.యూసఫ్

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేసి, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన విద్యానగర్‌లోని సెంట్రల్ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ తెలిపారు. ఈ నెల 20 వతేదీన దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మె దేశంలో నెలకొన్న పరిస్థితులు, యుద్ద వాతావరణం దృష్ట్యా జాతీయ కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెను జులై 19వ తేదీకి వాయిదా వేశాయని ఆయన చెప్పారు. ఈ మేరకు శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్మిక సంఘాల నేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నేతలు పాలడుగు భాస్కర్, బి.వెంకటేశం, టి.నర్సింహ్మారెడ్డి, కె.సూర్యం, వెంకటరాజం, ప్రవీణ్, ఎస్.ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

### హాల్ టిక్కెట్స్ ఇవ్వనందుకు విద్యార్థులు నిరసన

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** కళాశాలలో విద్యార్థులకు 75 శాతం అటెండెన్స్ లేదన్న సాకుతో హాల్ టిక్కట్స్ ఇవ్వనందుకు నిరసనగా శనివారం నిజాం కళాశాలకు చెందిన ఆనేక మంది విద్యార్థులు ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. తొలుత విద్యార్థులు కళాశాల రోడ్డు మీద బైఠాయించి, తదనంతరం ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో ఫీజులు కట్టించుకునేప్పుడులేని నిబంధన ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఎగ్జామ్ సమయం దగ్గరపడగానే ప్రిన్సిపల్ డిగ్రీ సెంకడ్ ఇయిర్,దర్డ్ ఇయిర్‌కు చెందిన 350 మంది విద్యార్థులకు హాల్ టిక్కెట్స్ ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. సాయంత్రం వరకు ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల గురించి ప్రిన్సిపల్ ఏమాత్రం పట్టించుకోలేదు. చివరకు పోలీసులు కేసులు పేడతామని హెచ్చరించడంతో విద్యార్థులు వెళ్ళిపోయారు.

## జూ పార్కు అభివృద్ధిపై అడ్వయిజరీ కమిటి సమావేశం

**చార్మినార్,మే 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో శనివారం జూ పార్కు మూడవ అభివృద్ధి అడ్వయిజరీ కమిటి సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ ఎలో సింగ్ ఆధ్వర్యంలో జరిగిన జూ పార్కు అడ్వయిజరీ కమిటి సమావేశంలో జూ పార్కు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. జంతువుల మార్పిడి కింద దేశంలోని పలు జూ పార్కులకు చెందిన జంతువులను జూ పార్కుకు తీసుకురావటం, జూ పార్కులో పచ్చదనాన్ని పెంచడం, జూ పార్కులో జంతువులపై పరిశోధనం చేయటం, జూ పార్కుపై మరింత ప్రచారాన్ని పెంచటం, జూ పార్కులో వాటర్ ట్రీట్ మెంట్ ఎస్‌టిపి ఏర్పాటు చేయటంతో పాటు జూ పార్కు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్నా నిర్ణయాలను జూ పార్కు అండ్ ఆథారిటి కమిటికి పంపించనున్నారు, ఈ సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ ఎలో సింగ్, జూపార్కు డైరెక్టర్ డాక్టర్ సునీల్. ఎస్.హీరామత్, మెట్రో పాలిటన్ జాయింట్ కమిషనర్ హెచ్ఎండిఎ శ్రీవాత్సవ కోట, హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, సిసిఎంబి ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాపతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసుదేవరావు, ఎయిమ్స్ బిబినగర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి, అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ యానిమల్ హస్‌బండ్రీ డాక్టర్ మల్లేశ్వరీతో పాటు పలువురు ఉన్నతాదికారులు పాల్గొన్నారు.


ట్యాంక్‌బండ్ వద్ద జరిగిన తిరంగా యాత్రకు తరలివెళ్తున్న విద్యార్థుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న పిఎల్ శ్రీనివాస్

# 1267 మంది పౌల్ట్రీ రైతులకు సిఎం న్యాయం చేయాలి

### -తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ విజ్ఞప్తి

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అక్రమంగా కొనసాగుతున్న జోనల్ వ్యవస్థను రద్దు చేసి 33 జిల్లాలకు కొడిగుడ్ల టెండర్లను కేటాయించి, 1267 మంది రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1267 మంది పౌల్ట్రీ రైతులు ఉంటే అవినీతి అధికారులు కేవలం 5 గురికి మాత్రమే టెండర్లు వచ్చేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, ఎన్ఇసిసి ఛైర్మన్ గుర్రం శేఖర్‌రెడ్డి, వైస్-ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎగ్ సెంట్రల్ కమిటీ మెంబర్ కసిరెడ్డి నారాయణరెడ్డి, కోశాధికారి కొండలరావు మాట్లాడుతూ టెండర్లు దక్కించుకుంటున్న ఈ ఐదుగురిని గత ప్రభుత్వంలో కూడా పక్క రాష్ట్రాల నుంచి కోడిగుడ్లు తీసుకువచ్చి నాణ్యతలేని గుడ్లును అంగన్వాడి సెంటర్లకు సరఫరా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన బర్డ్‌ఫ్లూ కారణంగా పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపో యారని, ప్రభుత్వం వీరిని అదుకునేందుకు టెండర్లలో అవకత వకలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం అంగన్వాడి పథకంలో కోడిగుడ్ల ప్రక్రియను


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ప్రభు త్వం నిలిపివేయడం పట్ల తమ ఫెడరేషన్ ప్రభుత్వానికి ధన్యా వాదాలు తెలుపుతున్నదన్నారు. నాణ్యమైన కోడిగుడ్లను అంగన్వాడి సెంటర్లకు గతంలో ఉన్న రేట్లకే తామ సరఫరా చేస్తామన్నారు. తకుకు జరుగుతున్న నష్టాలపై పోరాడుతున్న నల్లగొండ ఎంపి రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం పౌల్ట్రీ రైతులను అదుకునేలా తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి 1267 మంది రైతులకు న్యాయం చేస్తారని తాము నమ్ముతున్నామన్నారు.

## ఎంపి వంశీకృష్ణకు జరిగిన అవమానానికి ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలి : రాజు వస్తాద్

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** కాళేశ్వరం పుష్కారాలు ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంపి గడ్డం వంశీకృష్ణను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించకుండా తీవ్రంగా అవమానపరిచారని ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటి జాతీయ అధ్యక్షుడు రాజువస్తాద్ ఆరోపించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణను రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కుల బహిష్కరణ చేసిందని, ఇందులో రాజకీయ కుట్రదాగిఉందని, పుష్కారాల ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలో ఎంపి పేరు లేకపోవడం దారుణమన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ దళిత సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ వంశీకృష్ణ దళిత సామాజిక వర్గం అయినందున ఆయనకు అధికారులు, మంత్రుల ద్వారా ఈ అవమానం జరిగినట్లు దళిత వర్గాలు భావిస్తున్నాయని చెప్పారు. ఈ అవమానానికి ప్రత్యక్షంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, కార్యనిర్వాహణాధికారి, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కమిషనర్‌లు బాధ్యత వహించి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో జాతీయ ఎస్సీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజువస్తాద్

కమిషన్, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, వంశీకృష్ణకు జరిగిన అవమానం దళిత జాతికి తగినట్లుగా భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపికి జరిగిన అవమానికి ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో దళిత, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యలయాలను ముట్టడిస్తామని, నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపడతామని రాజువస్తాద్ ఆరోపించారు. ఈ సమావేశంలో వివిధ దళిత సంఘాల నాయకులు మన్నె శ్రీధర్‌రావు, ఆవుల సుధీర్, ఎం.మధు, వెంకటేశ్వర్లు, దాసరి విశాల్, జంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 19న కాజీపురలో ఉచిత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

**చార్మినార్,మే 17 ప్రభాతవార్త :** పాతబస్తీ శాలిబండ కాజీపుర లోని సయ్యద్ మంజిల్‌లో ఈ నెల 19వ తేదీన ఉచిత ఆధార్ కార్డు నమోదు కేంద్రాన్ని ప్రారంభిచనున్నట్లు ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ సయ్యద్ ఖాద్రి తెలిపారు. పాతబస్తీ ప్రజలు కోసం గతంలో కూడ పలు మార్లు కాజీపురలోని సయ్యద్ మంజిల్‌లో ఆధార్ నమోదు సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఎంతో మంది ప్రజలకు ఉపయోగం కలిగిందని ఆయన తెలియజేశారు. పాతనగరం ప్రజల సౌకర్యార్థం ఖాద్రియా ఇంటర్నేషనల్ సంస్థ, భారత ప్రభుత్వ ఇండియా పోస్ట్ సహకారంతో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9.30 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు ఆధార్ నమోదు కేంద్రం పని చేస్తుందని, ఈ అవకాశాన్ని పాతబస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### తిరంగ యాత్రకు ఎంపి విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు


తిరంగ యాత్రలో పాల్గొనటానికి బయలు దేరి వెళ్లిన ఎంపి విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,మే 17 ప్రభాతవార్త :** మన దేశ ఐక్యతకు, చిహ్నంగా త్రివిధ దళాల సేనలకు కృతజ్ఞతగా శనివారం నగరంలోని ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన తిరంగా యాత్రకు రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం నగరంలోని ట్యాంక్ ట్యాంక్ బండ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయ నిధి చేయూత : బండి రమేష్


లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, మే 17, ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు చేయూత లభిస్తోందని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 4,58,500 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధిని లబ్ధిదారులకు శనివారం అందజేశారు. కూకట్పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్‌కి చెందిన మహబూబ్ బాషాకు 60,000, చంద్రశేఖర్‌కి 60,000, బేగంపేట్‌కి చెందిన అజయ్ కుమార్‌కి 60,000, అల్లాపూర్‌కి చెందిన షేక్ దస్తగిరికి60,000, బాలనగర్‌కి చెందిన విజయలతకు 51,000, ఫతేనగర్‌కి చెందిన షేక్ సలీంకు 60,000, బోయిన్పల్లి చెందిన భరతమ్మకు 47,500, ఫతేనగర్‌కి చెందిన రాజన్నకు 60,000 మంజూరయ్యాయి. అట్టి చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, ప్రకాష్ ముదిరాజ్, రమేష్, చున్నుపాష, కుక్కల రమేష్, ఆయాజ్, అస్లాం, వరాహల స్వామి, మద్దూరి రాము, బాల నరసింహ, భరత్, మధు, రాజ్ పటేల్ పాల్గొన్నారు.

## క్రమశిక్షణగల కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు

### -బిఆర్ఎస్ యువనేతా ముఠాజైసింహా


బత్తుల కిరణ్‌కుమార్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** క్రమశిక్షణగల కార్యకర్తలకు పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని బిఆర్ఎస్ యువనేతా ముఠాజైసింహా అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్ బిఆర్ఎస్ ప్రచార కార్యదర్శి బత్తుల కిరణ్‌కుమార్ అభినందన సత్కార కార్యక్రమం గాంధీనగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముదారపు రాకేష్ కుమార్.పోతుల శ్రీకాంత్ పున్న సత్యనారాయణ ఎర్రం శ్రీనివాస్ గుప్త,రచ్చ నరేష్, సాయి యాదవ్, సాయి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు.

## తెలంగాణ సంప్రదాయాలు పండుగలలో డాక్టర్ అంబేద్కర్ విద్యాసంస్థల ప్రతిభ


కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు తెలంగాణ సంప్రదాయాలు పండుగలు కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. నటరాజ్ అకాడమీ మరియు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ డాన్స్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో దాదాపు ఇరవైకి పైగా బృందాలు పాల్గొనగా డా బి ఆర్ అంబేద్కర్ విద్య సంస్థల విద్యార్థులు తమదైన ప్రత్యేకతను నిలుపుకుని ఉత్తమ డాన్స్ ఐకాన్ అవార్డుని గెలుచుకున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా విద్య సంస్థల కరెస్పాండెంట్ జి.సరోజా వివేక్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులని అభినందించారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ అకాడమీ ఫౌండర్ నల్ల గిరి, అక్షిత ఫౌండేషన్ ఫౌండర్ బిట్టు, డాన్స్ మాస్టర్ నవీన్ సుంకరి, విద్యార్థులు పాల్గొన్నారు

### ఆది పురుషుడు ఆదిధర్మ గ్రంథం విశిష్టతను అందరికి తెలపాలి


ప్రసంగిస్తున్న వక్తలు

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** ఆది పురుషుడు ఆదిధర్మ గ్రంథం యొక్క విశిష్టతను చర్చించడం తోపాటు, గ్రంథం యొక్క ప్రాముఖ్యతను గ్రామస్థాయి వరకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలని ఆది పురుషుడు ఆది ధర్మ గ్రంథ ఆవిష్కరణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆది పురుషుడు ఆది ధర్మం గ్రంథా ఆవిష్కరణ సన్నహాక కమిటీ సమావేశం శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. గ్రంథ రచయిత, ఆది పురుష ధర్మ సమాజం ప్రచార ప్రధాన కర్త ప్రొఫెసర్ ఏకు తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సన్నాహక కమిటీ సభ్యులను నియమించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నల్ల సూర్యప్రకాష్, గొర్రె రాజయ్య, కార్యదర్శులుగా బాలకృష్ణ, గడ్డ యాదయ్య,, వసుళ్ళ సుధాకర్, మాస్టర్ కుమారస్వామి, రవి, మీడియా ఇన్చార్జిగా బరిగల శివ, ఉపాధ్యక్షులుగా చింత ముత్యాలరావు, సదాశివ, తదితరులతో కమిటీని నియమించారు.

## ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**పురానాపూల్,మే 17(ప్రభాతవార్త):** ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని పురానాపూల్ డివిజన్ మజ్లిస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని కబుతర్‌ఖానా వద్ద జరుగుతున్న సి.సి.రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను స్థానికులు పర్యవేక్షించుకోవాలన్నారు. నాణ్యతమైన పనులు చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీర్ భాను ప్రకాష్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే పిసిలు, 2బిహెచ్‌కెలో ఫ్లాట్లు కేటాయించాలి : కొంతం దీపిక

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో మోండా కార్పొరేటర్ భేటీ



మారేడ్‌పల్లి 2బిహెచ్‌కె అంశాలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్,మే 17 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని మారేడ్‌పల్లిలో నిర్మించిన 2బిహెచ్‌కెలో స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఫ్లాట్లు అలాట్ చేయాలని, రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సంవత్సరాల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న నిరుపేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఆయా బస్తీల్లో నెలకొన్న సమస్యలు, స్థానిక లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్పొరేటర్ కొంతం దీపిక కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ సెల్ కన్వీనర్ చిన్న వీరయ్య, కొంతం నరేష్, బస్తీ నాయకులు రౌతు రాజయ్య, ఎస్.బాల్‌నర్సింహ్మ, మోతె ప్రభాకర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : పి.ఎల్.శ్రీనివాస్**

**కంటోన్మెంట్,మే 17 ప్రభాతవార్త:** విద్యార్థుల కృషి, ఉపాధ్యాయులు మార్గదర్శం, తల్లిదండ్రుల సహకారంతో సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో 100కు 100 మార్కులు సాధించి అద్భుతమైన విజయాన్ని సాధించామని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు, వైస్ చైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్ తెలిపారు. సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మంచిన ఫలితాలు సాధించినందుకు శనివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ సమీపంలోని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ప్రసంగించారు. హై స్కూల్‌లో మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజా తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు : కమిషనర్

**దుండిగల్, మే 17, ప్రభాతవార్త**

దుండిగల్ మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి డబల్ బెడ్ రూమ్ గృహ యజమానుదారులందరకు కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలోని అన్ని బ్లాకులు కలిపి ఒక రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ని ఏర్పరచుకోవాలి. వారి వద్ద నుండి సమస్యలు కానీ ఫిర్యాదులు గాని స్వీకరించబడతాయి. ఫ్లోర్ ఫ్లోర్‌కి ఒక రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ని ఏర్పరచుకోవద్దు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి డబల్ బెడ్ రూమ్ అన్నిటికీ ఇంటి నెంబర్లు (హౌస్ టాక్స్) కేటాయించడం జరిగింది. మీకు వచ్చిన స్పెషల్ నోటీసుని ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే మున్సిపల్ ఆఫీస్‌కి వచ్చి సంప్రదించాలి. కానీ కొంతమంది దళారులు ఇది అలుసుగా చూసుకొని మేము ఇంటి నెంబర్ చూపిస్తాము అని అమౌంట్ కలెక్ట్ చేస్తున్నారని తెలిసింది. అలా ఎవరైనా చేస్తే వారిపైన క్రిమినల్ కేసుల నమోదు చేస్తాము. ఎవరు దళారుల మాటలు నమ్మొద్దని ఈ సందర్భంగా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు

**నొప్పి నివారణ కేంద్రం ప్రభుత్వం ఆరోగ్య రంగంలో తొలి అడుగు**



ఉస్మానియా ఆసుపత్రిలో పెయిన్ క్లీన్‌ను ప్రారంభం

**అఫ్జల్‌గంజ్,మే 17(ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో మొట్ట మొదటిసారిగా నొప్పి నివారణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది తెలంగాన ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఒక ప్రగతి శీల ప్రయోగంగా నిలిచింది. ఉస్మానియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నొప్పి నివారణ క్లీనిక్‌ను తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిక్రిస్టినా చొంగ్తూ, వైద్య సంచాలకులు డాక్టర్ నరేందర్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యం సామాన్య ప్రజలకు ఉచితంగా సమగ్ర నొప్పి నిర్వహణ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇతర అంతర్జాతీయయ స్థాయి ఆరోగ్య వ్యవస్థలలో శిక్షణ పొందిన వైద్యులు తమ అంతర్జాతీయ అనుభవాన్ని పరిజ్ఞానాన్ని స్థానిక వైద్య రంగానికి అందించేందు ముందు వచ్చినట్లు తెలిపారు. దీర్ఘకాలిక, సంక్లిష్ట నొప్పులతో బాధపడుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందలేని, రోగులకు గొప్పవరంగా మారనున్నట్లు తెలిపారు. ఆధునిక నిర్ధారణ, చికిత్సా పరికరాలు అమర్చబడి ఉన్నట్లు తెలిపారు. రోగులబహుళ విభాగాల నిపుణుల సహకారంతో సమగ్ర పద్దతిలో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రందాతలు ముందుకు వచ్చి ఏర్పాట్లు చేయడం సంతోషదాయకమన్నారు. ఉపశమనం కలిగిస్తుంది. ఈ క్లీనిక్‌లో ఆధునిక నిర్ధారణ, చికిత్సా పరికరాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్, ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్‌కుమార్, అభిమన్యుసింగ్, దాతలో ముఖ్యమైన వారు డాక్టర్ సురేందర్ సందెల్లా, డాక్టర్ రామ్ పసుపులేటి, ప్రొఫెసర్ జె.పద్మావతి రఘువేందర్, చంద్రకళా హరిప్రసాద్, హరిప్రసాద్ గోపికిషన్, రోగి సహాయత ట్రస్ట్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : కొంతం దీపిక**

**అడ్డగుట్ట, మే 17 ప్రభాతవార్త:** మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్, పద్మశాలి మహిళా అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు, ఎంబ్రైడరీ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ అధ్యక్షులు నోముల రామ్ ప్రకాశ్, కార్యదర్శి గుత్తికొండ రమేష్, పద్మశాలి మహిళా అభ్యుదయ సంఘం అధ్యక్షురాలు గంజి రజని, సభ్యులు నోముల రజని, గాయత్రి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, మే 17 ప్రభాతవార్తః**

అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం బన్సీలాల్ పేట డివిజన్ లోని వివైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల బస్తీ అధ్యక్షుడు వెంకట్ బాబు, ఇతర బస్తీ వాసులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన త్వరలో బస్తీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ మేరకు శనివారం అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బస్తీ ప్రజలు ఫంక్షన్‌లు, తాగునీరు సరిపడా రాకపోవడం, కలుషిత జలాలు సరాఫరా, లిఫ్ట్ పని చేయకపోవడం, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం లాంటి సమస్యలను వివరించారు. దీంతో వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఖలీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఇవ్వాలని కోరగా అర్హులైన స్థానికులకు ఇవ్వడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు. పింఛన్‌లు రావడం లేదని స్థానికులు తెలుపగా త్వరలోనే అర్హులైన వారి వివరాలను సేకరించి అందజేస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేయిస్తానని వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సౌకర్యాలు, వసతులు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఏ సమస్య ఉన్నా పరిష్కారం కోసం నేను ఉన్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్, కార్పొరేటర్ హేమలత, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, వినోద్, వెంకటేష్, ఎలెక్ట్రికల్ కృష్ణ, హార్టికల్చర్ అధికారి విశాల్, స్ట్రీట్ లైట్ అధికారి సాగర్, బస్తీ అధ్యక్షుడు వెంకట్ బాబు, వెంకటేషన్ రాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అధ్యాత్మిక భక్తి బావం పెంపొందించుకోవాలి : జంపన**

**కంటోన్మెంట్,మే 17 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక భక్తి బావం పెంపొందించుకోవాలని, మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్‌లు తెలిపారు. 6వ వార్డు సీతారామ్‌పూర్‌లోని వీరాంజనేయ శివ పంచాయతన ఆలయం 23వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో దీపారాధన, అంకురార్పన, రుద్రహోమం, కళ్యాణం వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు.

**చింతల్ బస్తీలో . .** చింతల్ బస్తీలోని నాగదేవత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ విపీ, జంపన ప్రతాప్, మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోత రాజు, లక్ష్మణ్ రాజు, బాలవీర్, ప్రసన్న పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : తేలుకుంట**



5వ వార్డు కాకగూడలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తేలుకుంట సతీష్ గుప్త

**కంటోన్మెంట్,మే 17 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ 5వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త తెలిపారు. శనివారం కాకగూడ బస్తీలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా బస్తీల్లో నెలకొన్న సమస్యలు, పాడైన బోర్‌వెల్స్ మరమ్మత్తులకు సిఈఓ మధుకర్ నాయక్, ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

**రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా మీడియా కన్వీనర్ ఎజిఎం ఇన్చార్జిగా నీలం రమేష్ నియామకం**



రమేష్‌కు నియామకపత్రం అందిస్తున్న మామిడి భీంరెడ్డి తదితరులు

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ మీడియా కన్వీనర్ అలాగే ఏజీఎం ఇంచార్జిగా నీలం రమేష్‌ను రెడ్ క్రాస్ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి నూతనంగా నియమించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తన అనుభవాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖకు మీడియా కన్వీనర్‌గా సేవలు అందిస్తానని భవిష్యత్తులో జరగబోయే బ్లడ్ సెంటర్, జన ఔషధీ మెడికల్, షాపు నిర్మాణంలో పాలుపంచుకొని రెడ్ క్రాస్ నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా మీడియా ద్వారా పబ్లిసిటీ చేయడం కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈబాధ్యతలు అప్పగించిన హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## తిరంగా ర్యాలికి తరలిన కార్పొరేటర్



జాంబాగ్ డివిజన్ నుంచి తిరంగా ర్యాలీకి బయలు దేరిన కార్పొరేటర్

**గన్‌ఫౌండ్రి,మే 17(ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు ఇచ్చిన తిరంగా ర్యాలీకి గోషామహల్ నియోజకవర్గం బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న తిరంగా ర్యాలీ కోసం బయలు దేరివెళ్లారు. జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో జాంబాగ్ డివిజన్ నుంచి బిజెపినాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, రాజ్‌కుమార్, ప్రవీణ్, జనార్ధన్, సందీప్, రవి, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు. కాగా పాకిస్తాన్‌కు వ్యతిరేరంగా నినాదాలు చేశారు.

**హైకోర్టు ఉద్యోగమన్న లేడీ..రూ. 6లక్షలతో పరార్**

**హైదరాబాద్, మే17, ప్రభాతవార్త:** ఉద్యోగాల అన్వేషణలో ఉన్న అమాయక నిరుద్యోగులు ఎవరు ఎం చెప్పిన నమ్మి పోసపోతున్నారు. మధురాపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివరాల ప్రకారం వెంగళరావునగర్ కాలనీకి చెందిన ఎస్.జీవన్ విజేందర్ (35) ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఈ క్రమంలోనే తెలిసిన వారితో అంబర్‌పేటకు చెందిన ప్రసన్నరెడ్డి పరిచయమైంది. దీంతో తాను హైకోర్టు న్యాయమూర్తి అని, చాలా మంది అడ్వకేట్లు తెలుసని నమ్మించింది. కోర్టులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. అయితే రూ. 15లక్షలు ఇస్తే జాయిన్ కావొచ్చనడంతో ముందు అడ్వాన్స్‌గా రెండేళ్ల క్రితం రూ. 6.5 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయానని భావించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేపట్టారు.

**సున్నంచెరువు పూడికతీత పనులు పరిశీలించిన కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్**



సున్నం చెరువు పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ, మే 17, ప్రభాతవార్తా**

డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ సున్నంచెరువు పూడిక తీత పనులను స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పరిశీలించారు. హైడ్రా చేపడుతున్న చెరువుల సుందరీకరణల్లో భాగంగా సున్న చెరువును పూడిక తీయడంతో పాటు అన్ని విధాల అభివృద్ధి చేపడుతుండగా ఆ పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు పూడికతీత పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాయిత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు మాజీ అధ్యక్షులు సంజీవరెడ్డి, జితేందర్, సి.బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

**ఎలాంటి సమాచారం లేకుండా మా స్థలాన్ని సర్వే చేయడం చట్ట విరుద్ధం : ఎమ్మెల్యే మర్రి**



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**పేట్ బషీరాబాద్, మే 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల డివిజన్ సుచిత్ర ప్రాంతంలో సర్వే నంబర్ 82,83లో ఉన్న తమ భూమిలో ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు ఎడి సర్వే చేపట్టడం చట్ట విరుద్ధమైన చర్య అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య సర్వే చేయడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ న్యాయపరంగా తమకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేపట్టడం సరైంది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేపట్టే 15 రోజుల ముందు స్థల యజమానికి నోటీసు ఇవ్వాలని కానీ అలాంటి వాటికి తావు ఇవ్వకుండా కేవలం పోలీసుల పహారాలో అధికారులు అత్యుత్సాహంగా వ్యవహరించి సర్వే చేపట్టడం సరైంది కాదని అన్నారు. తాము న్యాయబద్ధంగా సర్వేనెంబర్ 82, 83లో కొనుగోలు చేశామని, దీనిపై కొంతమంది వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా వ్యవహరించి చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం సరైనది కాదని హెచ్చరించారు. కాగా ఇరువర్గాల మధ్య ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి సర్వే చేపట్టారు.

**తెలంగాణ రాష్ట్ర మీడియా కౌన్సిల్ చైర్మన్‌గా కిరణ్‌బేజాడి**



కిరణ్ బేజాడికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ప్రముఖులు

**సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త:** ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసిఐ) తెలంగాణ రాష్ట్ర మీడియా కౌన్సిల్ చైర్మన్‌గా కిరణ్‌బేజాడి నియమితులైనారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, పాకలపాటి విజయ్‌వర్మ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 31న ప్రముఖ సినీ నటుడు స్వర్గీయ సూపర్ స్టార్ కృష్ణ పేరిట సూపర్ అవార్డులను వివిధ రాష్ట్రాలలోని పలువురు ప్రముఖులకు ఎల్.వి.ప్రసాద్ ల్యాబ్‌లో ప్రదానం చేస్తామన్నారు. తమ సంస్థ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సమ్మిట్స్, ఫిలిం టూరిజాన్ని అభివృద్ధి చేయడంలో నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సినీ నటులు ఇహిరిక, సాల్మన్‌సాని, కె.వెంకటేష్, సత్యం రాపల్లి, మున్నాదు చందు, యు.రాజేశ్వరి, బార్గవి వినాయక్ పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన తిరంగ ర్యాలీకి రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి బిజెపి నేతలు తరలివెళ్లిన దృశ్యం

## విద్యతో పాటు ఆటలను కూడా ప్రోత్సహించాలి : కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

**ముషీరాబాద్, మే 17, ప్రభాతవార్త:** విద్యతో పాటు విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి కలిగే విధంగా ప్రోత్సహించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఘంటసాన క్రీడా మైదానంలో ముగిసిన అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నివి ఛారిటబుల్ ట్రస్ట్, గాంధీనగర్ డివిజన్ అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన ఛత్రపతి శివాజీ బాయ్స్ టీమ్‌కు ఆమె ట్రోఫీతో పాటు బహుమతులు అందచేశారు. గత రెండు రోజులుగా జరుగుతున్న మ్యాచ్‌లలో మొత్తం 16 టీంలు పాల్గొనగా, విజేతలుగా ఛత్రపతి శివాజీ బాయ్స్ టీమ్ నిలువగా, ఐకాన్ స్టార్స్ రన్నరప్‌గా నిలిచారు. విజేతలుగా నిలిచిన ఛత్రపతి శివాజీ టీమ్‌కు పదివేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందచేయగా, ఐకాన్ స్టార్ టీమ్‌కు ఐదువేల నగదు బహుమతి అందచేసి, టోర్నమెంటులో పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, ఇండియన్ మాజీ క్రికెటర్ వెంక ప్రతాప్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్‌కుమార్, స్థానిక బీజేపీ నాయకులు శ్రీకాంత్, కృష్ణప్రసాద్, ఎం.ఉమేష్, మహమూద్, ప్రకాష్‌యాదవ్, శివకుమార్, నర్సింహ, సాయికుమార్, ఆనంద్‌రావు, డి.కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతి అందచేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

## రైతు సమస్యలు, సామాజిక తెలంగాణ లక్ష్యంగా పోరాటం

-ఆర్‌ఎల్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రిలోగ్ త్యాగి

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:**

రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రైతుల సమస్యలు, సామాజిక తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా పోరాడుతుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రిలోక్ త్యాగి తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి త్రిలోక్ త్యాగి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం, యువతకు పాలన పగ్గాలు అందించడమే లక్ష్యంగా తమ పోరాటం ఉంటుందన్నారు. భారత దేశ పాలనలో అమెరికా జోక్యం చేసుకోవడం ఏంటని కేంద్రాన్ని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అవినీతి పేరుకుపోయిందన్నారు. కమీషన్లు లేనిదే పనులు కావడం లేదని ఒమంత్రి పేర్కొనడం పట్ల అవినీతి ఎంత తారాస్థాయికి చేరుకుందు ప్రజలు ఆలోచించాలన్నారు. 14న హైదరాబాదులోని అల్వాల్‌లో రోజ్ గారి మేల నిర్వహిస్తామని ఈసందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కిన్నెర సిద్ధార్థ, బీరప్ప, ప్రభాకర్ గౌడ్, నందిపాటి జానయ్య, మిర్జా బేగ్, శివకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న త్రిలోగ్ త్యాగి, కపిలవాయి దిలిప్‌కుమార్ తదితరులు

**కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం**



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న స్థానికులు

**జీడిమెట్ల, మే 17, ప్రభాతవార్త**

మౌళిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం 125 గాజుల రామారం డివిజన్ మిథిలా నగర్ నందు 20 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మౌళిక వసతుల కల్పనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పరుస్తామన్నారు. మౌళిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, శివా నాయక్, ఆసిఫ్, ప్రసాద్, నిజాంపేట్ కార్పొరేషన్ కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మిథిలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఠాగూర్, ప్రధాన కార్యదర్శి చెంగల్ రాయుడు, ఉపాధ్యక్షులు చంద్ర మోహన్, కమిటీ సభ్యులు నరసింహ, హన్మంత్ రావు, శ్రవణ్, రామకృష్ణ, శివ, ప్రవీణ్ పోతినేని, కిషోర్, సుధాకర్, వెలగపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వీనులవిందు పసందైన మహాగజల్ గానం



మహాగజల్ గానంలో పాల్గొన్న గజల్ కవయిత్రులు, గాయకులు

**రవీంద్రభారతి, మే 17 ప్రభాతవార్త :** ఛాంపియన్ ఆఫ్ గజల్, క్రియేటివిటీ అనే ప్రపంచ రికార్డులతో భారతదేశ గజల్ చరిత్రలో నూతనాధ్యాయానికి నాందిపలికిన గజల్ వాగ్గేయకారిణి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన 10 గజళ్ళ సంపుటాల పండుగ; మహా గజల్ గానం విచ్చేసిన గజల్స్ ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులకు ఎంతో పసందుగా వీనులవిందు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వైభవోపేతంగా రాజావాసిరెడ్డి మల్లీశ్వరి పలుకులతో ప్రారంభమై ప్రతిష్టాత్మకం, వినూత్నంగా రసరమ్యంగా నిర్వహించబడిన మహాగజల్ గానంలో ఆరుగురు ప్రఖ్యాత గజల్ గాయకులు ఎంఆర్‌కె.ప్రభాకర్, లక్ష్మీభవాని, రుక్మిణి, శాంతినిర్మలలతోపాటు శారద, నాగలక్ష్మిలు పాల్గొన్నారు. అనంతరం తెలుగు గజల్ పరివ్యాప్తికై గజల్ కార్యక్రమాలు నిర్వహించి గజల్‌క్వీన్‌గా ప్రసిద్ధిగాంచిన మల్లీశ్వరి రచించిన తెలుగు గజల్స్‌లోని హృద్యమైన భాషని, అందమైన బావుకతను, సౌందర్య కవితాత్మకతను మహత్తును గాయకులు హృదయాలకు హత్తుకుపోయేలా తమ గజల్స్ గానంచేసి ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సురారం శంకర్, విజయగోలి తదితరులు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిని ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.


**వార్త CLASSIFIEDS వార్త**

**CHANGE OF NAME**

★ I, Sai Prerna Gowri Garlapati D/o. Garlapati Venkata Satya Laxmi Narasinga Srinivas R/o. H.No. 11-3-366/1&2 Prasanna Sai Enclave, Flat No.401, Srinivas Nagar, Sec-bad, Have Changed My Name As "PRERNA GOWRI GARLAPATI" for the Purpose of All Official Records. (Ro.No.84589)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నెం : 01/EE (PD-CZ)/GHMC/2025-26, తేది: 17.05.2025.

పని యొక్క పేరు: హైదరాబాద్ లక్డీ-కా-పూల్ వద్ద లేట్ శ్రీ కొణిజేటి రోశయ్య యొక్క 9 అడుగుల కాంస్య విగ్రహ స్థాపన మరియు పీడస్టల్ యొక్క నిర్మాణం. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ, సమయం: ప్రారంభ తేదీ: 19.05.2025 సా.4.00. ముగింపు తేదీ: 26.05.2025 సా.5.00. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ప్రాజెక్ట్ డివిజన్-సెంట్రల్ జోన్), 8వ అంతస్తు, GHMC, పార్కింగ్ కాంప్లెక్స్, ఆబిడ్స్, హైదరాబాద్ 7893066262. గమనిక: ఇతర వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PD CZ, GHMC.

DIPR.NO.2073-PP/CL/ADVT/1/2025-26 తేది: 17.05.2025

**IN THE COURT OF HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM V ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL MALKAJGIRI DISTRICT :: AT L.B.NAGAR**
**OS. NO. 464 OF 2025**

**Between :**
Meesala Chandrakala & Others ...Plaintiffs
And
1. The Tahsildar cum Mandal Revenue Officer, Ghatkesar &
**2. All Concerned** ...Defendants

**NOTICE**

To, whomsoever it may concern. The general public are hereby informed that the above named Plaintiffs filed the above suit for declaration of legal heirs of Late. Meesala Krishna who expired on 07.03.2013, and the same is posted to 10.06.2025 for appearance of objections, if any by anyone in the above case and therefore make it convenient to appear before the above Hon'ble Court at 10.30 am on 10.06.2025 either in person or through an advocate duly instructed by you. incase of failure to appear on the said date, the matter will be decided on merits in your absence.

**SCHEDULE OF PROPERTY**

All that the residential house bearing H.No. 3-80/1, in plot no. 52, admeauring 100 Sq.yards or 83.6 Sq.Mtrs situated at Narapally Village and Grampanchayat, Ghatkesar Mandal, Malkajgiri Mandal, Medchal –Malkajgiri District and bounded by : NORTH : 20' ft wide Road, SOUTH : Neighbours Land EAST : Plot no. 35 WEST : Plot no. 34 part

**(BY ORDER OF THE COURT)**
**M/s. KAVADI NARESH**
**B. Vincent Jaya Raj**
Advocates
Office : H.No. 9-22, Opp SBI, Ghatkesar Municipality, Medchal Malkajgiri District, Telangana – 501301
**Cont. 9848234011**

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియచేయునది మరియు ప్రకటించునది ఏమనగా మాక్లైంట్, AP ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్‌ల సహకార హౌస్ బిల్డింగ్ సొసైటీ, యల్లారెడ్డిగూడ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్, తెలంగాణ వద్ద వున్న 2370చ.అ॥ మొదటి అంతస్తు మరియు 2370చ.అ॥ గ్రౌండ్ ఫ్లోర్ యొక్క ఒక RCC స్ట్రక్చర్‌తో 877చ.గజాలు లేదా 733చ.మీటర్లు కొలతగల, 139 నం. ప్లాట్, ఇం.నం.8-3-1055 కలిగి దానిపై సూపర్ స్ట్రక్చర్‌తో కలిపి వున్న భూమి యొక్క మొత్తం అదంతా కలిగిన ఆస్తిని దాని చట్ట ప్రకార యజమానులు 1. శ్రీ రెడ్డి VR కిరణ్. 2. శ్రీమతి జ్యోత్స్నానార్ల. 3. శ్రీమతి. కోకా జానకి స్వర్ణలత అందరూ లేట్ శ్రీ రెడ్డి సత్యనారాయణ మూర్తి మరియు శ్రీమతి రెడ్డి భాస్కరమ్మల యొక్క చట్ట ప్రకార వారసుల నుండి విలువైన విక్రయ పరిగణన కొరకు కొనుగోలు చేయుటకు ఉద్దేశించారని ప్రకటించడమైనది. ఏ వ్యక్తి(లు) పైన పేర్కొన్న ఆస్తులకు సంబంధించి ఏదైనా హక్కు, టైటిల్ లేదా ఆసక్తి ఉంటే వారి అభ్యంతరాలను ఈ ప్రచురణ యొక్క తేదీ నుండి 7 రోజులలోపుగా తెలియచేయవలెను. లేని పక్షంలో మాక్లైంట్ యొక్క ఎంపిక ప్రకారం వ్యవహారం పూర్తి చేసుకోవటం జరుగుతుంది. ఆపై తరువాత అభ్యంతరాలు అందినా అవి ఏవైనా రద్దు అయినట్లుగా పరిగణించబడతాయి.

అక్షత్ సంఘీ మరియు ప్రణీత్ సంఘీ
న్యాయవాదులు
ఫ్లాట్ నం.302, వన్‌టవర్స్,
3వ అంతస్తు, మహేష్ నగర్ కాలనీ,
చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్-500001.
సెల్ నం: 09963 102934
ఇ-మెయిల్ : akshatsanghi@gmail.com

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR, HYDERABAD-SOUTH, AT: ERRAGADDA.**
**A.B.R.C.F. No. 514 OF 2024**
M/s. BABA CHAURANGINATH CHIT FUND (P) LTD., **... DISPUTANT**
**Vs.**
M.MAHESH RAO & OTHERS **.... OPPONENTS**

To
1). M.MAHESH RAO, S/o. Sri. M. Chinna Tirumalaiah, R/o. 3-14-12/5/1, Road No.2, Ananda Jyothi School, Ramanthapur, Uppal, K.V. Ranga Reddy– 500 039.
2). RAJOLI CHETAN S/o. Sri. R. Subhash, R/o. H.No. :21-7-808, High Court Road, Ghansi Bazar, Bahadurpura, Hyderabad-500064.
3). G. SAINATH YADAV S/o. Sri. Ganthula Satyanarayana Yadav, R/o. 4-8-290, Gowli guda, Nampally, Hyderabad – 500 012.
4). M.MADHUSUDHAN RAO S/o. Sri. Chinna Tirumalaiah, R/o. 3-16-992/1/A, Street No.3, Kamakshi Pwam, Ramanthapur, Amberpet, Hyderabad-500013

Please take notice that the above dispute is filed Disputant against you and other for recovery of Rs.10,45,260/- and the same is posted to dated : 20-05-2025, for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator, Hyderabad-South, 8-3-166/5/2, 2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 3.00 PM if you fail to attend the said office on that day the case will be heard and decided exparte.

**BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR**
**M/S.BABA CHAURANGINATH CHIT FUND PRIVATE LIMITED**
Foreman / Managing Director
21-7-721, Flat No. 304,
M.B. Towers,
Ghansi Bazar, Hyderabad.
**Cell : 9177156038**

## రైతు సేవ సహకార సంఘంలో పర్సన్ ఇంచార్జి కమిటీ సమావేశం

### టెస్కాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మ సత్త



**తుర్కయంజాల్, మే 17, ప్రభాతవార్త :** తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం పర్సన్ ఇంచార్జి కమిటీ సమావేశనికి ముఖ్యఅతిథిగా టెస్కాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య హాజరై సంఘ పర్సన్ ఇంచార్జ్ కమిటీ సమావేశం నిర్వహించారు.కొత్త కూర్మ సత్తయ్య వారు మాట్లాడుతూ, సమావేశంలో నూతనంగా 11 మంది సభ్యులుగా చేర్చుకోనైన ది, 9 మంది రైతులకు 1కోటి 25 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేశామని సంఘ 2425 ఆర్థిక సంవత్సరం యొక్క ముగింపు లెక్కలు ఆమోదించామని 2526ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెల జామ ఖర్చులు ఆమోదించనైనది. మరియు సంఘ సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృద్ధి కార్యక్రమములు చేయుటకు నిర్ణయించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పర్సన్ ఇన్చార్జి కమిటీ మెంబర్లు కొత్త రాం రెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగ్ రావు, వంగేటి లక్ష్మ రెడ్డి,కోంద్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణ రెడ్డి, సామ సత్య నారాయణ రెడ్డి, మరియు సంఘ సెక్రెటరీ వై.రాందాస్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీవో కిష్టయ్య

**ఎల్బినగర్, మే 17 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు జాగ్రత్తలు వహించాలని మలక్పేట ఆర్టీవో కిష్టయ్య పేర్కొన్నారు. జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సి.రమేష్ ఆదేశాల మేరకు కిష్టయ్య ఆధ్వర్యంలో శనివారం ఆర్టిఏ ఈస్ట్జోన్ పరిధిలో స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యాలు, డ్రైవర్లతో బస్సు ఫిట్నెస్ గురించి నిబంధనలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు నడిపే డ్రైవర్లు ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గమ్య స్థానానికి చేర్చాలన్నారు. అదేవిధంగా ఆర్టిఏ నియమ నిబంధనల మేరకు బస్సులు పూర్తిస్థాయి ఫిట్నెస్ తో ఉండే విధంగా బస్సుల యజమాన్యాలు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు ఎం.బలరాం ఆర్.రమేష్, ఆర్.నరేందర్పాల్సింగ్, ఆర్.రాధిక సిబ్బంది పాల్గొన్నారు.

## త్రివర్ణ పతాకాలతో కాషాయదండు



కార్యక్రమంలో శ్రీకాంత్, బత్తుల సుమన్గౌడ్, కృష్ణప్రకాష్,

**ఎల్బినగర్, మే 17 ప్రభాతవార్త:** భారత్ మాతాకీ జై అంటూ భారత సైన్యానికి జై అంటూ త్రివర్ణ పతాకాలను చేత పట్టుకొని కాషాయదండు కదం తొక్కారు. భారత పరాక్రమానికి ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో ఆ సందర్భాలను మననం చేసుకుంటూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు జై కొడుతూ కాషాయదళం ముందుకు సాగారు. చైతన్యపురి డివిజన్లో బిజెపి నాయకులు చలో ట్యాంక్ బండ్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి వెళ్లారు. బిజెపి ఎస్సీ సెల్ మోర్చా నాయకుడు కృష్ణప్రకాష్, రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడు బత్తుల సుమన్గౌడ్, ఆధ్వర్యంలో ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, పర్ల శివ, రామ్మోహన్, వెంకటేష్ మామ, భానుప్రసాద్, రవి,అర్జున్సింగ్, అమూల్యారెడ్డి, భార్గవ్, చింటూ, సందీప్ పాల్గొన్నారు

## రూ.32 లక్షలతో రజక సంఘం భవనం : శ్రీవాణి



రామంతాపూర్ రజక సంఘం స్లాబ్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మే 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ రజక సంఘం దోభీఘాట్ వద్ద రూ.32లక్షల వ్యయంతో కమ్యూనిటి హాల్ మొదటి అంతస్తు నిర్మిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కమ్యూనిటిహాల్ మొదటి అంతస్థు స్లాబ్ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ రామంతాపూర్లోని రజక సంఘం నేతలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రజక సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పనులు నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి దానయ్య, జిత్తు, శంభులింగం, బొడ్డుపల్లి లింగం, పవన్,పలువురు స్థానికులు పాల్గొన్నారు.



ట్యాంక్బండ్ తిరంగా ర్యాలీకి కార్యకర్తలతో బయలుదేరుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

## హైపర్ టెన్షన్ పై అవగాహన పెంపొందించుకోవాలి : డాక్టర్ శశాంక్

**మలక్ పేట ,మే 17, ప్రభాతవార్త:** హైపర్ టెన్షన్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని కేర్ ఆస్పత్రి సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శశాంక్ మాడభూషణ పేర్కొన్నారు. ప్రపంచ హైపర్టెన్షన్ దినోత్సవం సందర్భంగా మలక్ పేట లోని కేర్ హాస్పిటల్స్ లో అధికరక్తపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ఆసుపత్రికి వచ్చిన రోగులు మరియు సందర్శకులకు ఉచితంగా రక్తపోటు పరీక్షలు చేయడంతో పాటు సమీప ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి హైపర్టెన్షన్పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైపర్టెన్షన్ సైలెంట్ గా ప్రభావం చూపించే వ్యాధి అని నియంత్రణ లోపిస్తే గుండె, కిడ్నీ, మెదడు వంటి కీలక అవయవాలను దెబ్బతీస్తుందని వివరించారు. ప్రతిఒక్కరూ తన బీపీ స్థాయిని తెలుసుకుని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న కొందరికి అధిక రక్తపోటు ఉందని గుర్తించి వారికి వైద్య సలహాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలి, వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే హైపర్టెన్షన్ను నియంత్రించవచ్చని తెలిపారు. ఇటీవల భారతదేశంలో అనేక మంది ప్రముఖులు హఠాత్తుగా గుండెపోటుతో మరణించడంలో హైపర్టెన్షన్ కీలక పాత్ర పోషించిందని గుర్తించడం జరిగిందని వివరించారు. సాధారణంగా ఆరోగ్యంగా కనిపించే వారు కూడా రక్తపోటు



ప్రజలకు ఉచితంగా రక్త పోటు పరీక్షల నిర్వహిస్తున్న వైద్యులు

నియంత్రణలో లేకపోవడం వలన మరణించడం ద్వారా, యువత మరియు మధ్య వయస్సు వారిలో హృదయ సంబంధ సమస్యలు పెరుగుతున్నాయని స్పష్టమవుతోందని తెలిపారు. ప్రపంచ హైపర్టెన్షన్ దినోత్సవం సందర్భంగా, 30 ఏళ్లకు పైబడి ఉన్న ప్రతి ఒక్కరూ తమ బీపీని పరీక్షించుకోవాలని కేర్ హాస్పిటల్స్ కోరుతోందని పేర్కొన్నారు. ముందస్తు గుర్తింపు ప్రాణాలను రక్షించగలదని, నిపుణుల పర్యవేక్షణతో హైపర్టెన్షన్ను సమర్థవంతంగా నియంత్రించవచ్చని, ఆరోగ్యంగా, దీర్ఘకాలం జీవించవచ్చని పేర్కొన్నారు. "మీ బీపీ తెలుసుకోండి – అదుపులో ఉంచండి" అనే నినాదంతో ముందుగా తనిఖీ చేసుకోవాలన్న సందేశాన్ని కేర్ హాస్పిటల్స్ ప్రజల్లోకి తీసుకెళ్లిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# మలక్ పేటలో భారీ దొంగతనం

-సుమారు 67 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీ

డాగ్ స్క్వాడ్ , క్లూస్ టీమ్ తో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు

-ఐదు బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు



మలక్ పేట రైల్వే స్టేషన్ వెంబడి సంఘటన ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ తో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్న చాదర్ ఘాట్ పోలీసులు

**మలక్ పేట ,మే 17, ప్రభాతవార్త:** మలక్ పేటలో భారీ దొంగతనం జరిగిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సుమారు 67.65 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు చాదర్ ఘాట్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. ప్రైవేట్ జాబ్ చేస్తున్న మొహమ్మద్ ఫహీముద్దీన్ (56) చాదర్ ఘాట్ అజంపురా వెయింగ్ బ్రిడ్జ్ సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కాగా రెండు రోజుల క్రితం అతని తమ్ముడు ఖాజా మొయినుద్దీన్ అతని భార్య మరియం ఫాతిమాలు వారి నివాసంలో పడిపోవడంతో ఉదయ్ ఓమ్నీ ఆసుపత్రి, అబిడ్స్ లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దీంతో నా భార్య ఆమెను చూసేందుకు ఆసుపత్రికి వెళ్లగా, మా కుమారుడు తమ్ముడు ఇంట్లోనే ఉండిపోయాడు. శుక్రవారం రాత్రి 11:00 గంటల సమయంలో నేను మరియు నా కుమార్తె భోజనం చేసి నేను నా పడకగదిలో, నా కుమార్తె పక్క గదిలో నిద్ర పోయామని తెలిపారు. కాగా అర్ధరాత్రి సమయంలో సుమారు 01:00 గంటల ప్రాంతంలో, ఓ గుర్తుతెలియని వ్యక్తి మలక్ పేట



చోరీకి గురైన నివాసంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రైల్వే స్టేషన్ వెంబడి మా ఇంటి వెనుక వైపున ఉన్న కిచెన్ విండో ద్వారా చొరబడి, అలమారాలో ఉన్న బంగారు ఆభరణాలు మరియు వస్తువులను దొంగిలించాడు. అలమారాకు మెయిన్ తాళాలన్నీ అలమారా హ్యాండిల్కు వేలాడుతున్న ఓ చిన్న బ్యాగులో పెట్టి ఉంచడం జరిగిందన్నారు. అనుమానితుడు ఆ తాళాలు తీసుకొని అలమారాలోని అన్ని కంపార్ట్మెంట్లను తెరిచి విలువైన బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్ మొదలైనవి దొంగిలించారు. ఉదయం 4:00 గంటలకు నేను లేచి చూశాక, అలమారా తలుపు తెరిచి ఉండడం, వస్తువులు కింద పడిపోయి ఉండటం గమనించి వెంటనే దొంగతనం జరిగినట్లు అర్థమైంది. అల్మారా లో ఉన్న 6 7.65 తులాల బంగారు ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్, రాడో వాచ్, వీడియో కెమెరా, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితుడు చాదర్ ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాగ్ స్క్వాడ్ , క్లూస్ టీం లతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టిన పోలీసులుమలక్ పేటలో భారీ చోరీ జరిగిందనే సమాచారం తెలియడంతో మలక్ పేట ఏసీపి శ్యాంసుందర్, చాదర్ ఘాట్ ఇన్స్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ భూపాల్ గౌడ్, ఎస్ ఐ లు తిరుపతి, భరత్ లు తన సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ ,క్లూస్ టీం లతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మలక్ పేట ,నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారని తెలిసింది. 5 టీం లతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు మలక్ పేట ఏసిపి శ్యాంసుందర్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బండారి రాజిరెడ్డి బాటలో నడుస్తా : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**రామంతాపూర్, మే 17 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే, తన అన్న బండారి రాజిరెడ్డి బాటలో నడుస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్ గాంధీనగర్లో వివిధ పార్టీలు, కుల సంఘాలు, కాలనీ నేతల ఆధ్వర్యంలో దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిబద్ధత కూడిన రాజకీయాలు చేయడంలో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. రామంతాపూర్ బైపాస్ రోడ్డును తన స్వంత నిధులతో నిర్మించి ఇక్కడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారని కొనియాడారు. రామంతాపూర్లోని అన్ని కుల సంఘాలతో ఆయనకు మరిచయం ఉందని, ఆయన ఆశయసాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రామంతాపూర్ నేతలు బైపాస్ రోడ్డుకు స్వర్గీయ రాజిరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రామంతాపూర్లోని కూడలి వద్ద విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీల నేతలు గంధం నాగేశ్వర్రావు, సర్వ బాబుయాదవ్, పి.శ్రీకాంత్గౌడ్, బోసాని పవన్, గడ్డం రవికుమార్, దర్శనం వినోద్, ఆవులగడ్డ శ్రీనివాస్యాదవ్, దీటి మల్లయ్య, సుర్వి మురళీగౌడ్, జలీల్పాషా, జహంగీర్, చాంద్పాషా, విజయ, సర్వ సత్తయ్య, బొబ్బల వెంకట్రెడ్డి, సూరం శంకర్, సంబెట్ నరేష్, బుర్ర మహేందర్, పలువురు కాలనీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రామంతాపూర్ నేతలు

## సబితారెడ్డి మెప్పు కోసమే కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేస్తున్నారు: మల్లారెడ్డి, గోవర్ధన్రెడ్డి

**సరూర్నగర్, మే 17 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మెప్పు పొందడం కోసమే బిఆర్ఎస్ నాయకులు పోటీ పడి మరీ కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తున్నారని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్లు ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్నలను పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న విమర్శలను ఖండించిన సీనియర్ నాయకుడు దేప భాస్కర్రెడ్డి తదితరుల వ్యాఖ్యలను జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా ప్రతి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. శనివారం బాలాపూర్ సాయినగర్ కాలనీలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బిఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా అక్రమాలకు, అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ నాయకులకు విమర్శించే అర్హత లేదన్నారు. నిత్యం ప్రజల మధ్య తిరుగుతున్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కించపరిచే విధంగా బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు చేయడాన్ని సహించమని వారు హెచ్చరించారు. నియోజకవర్గంలో అర్హులైన వారికి సిఎం రిలీఫ్ ఫండ్లు మంజూరు చేయిస్తున్న కెఎల్ఆర్కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండడాన్ని బిఆర్ఎస్ నేతలు సహించలేకపోతున్నారని వారు తెలిపారు. అల్మాస్గూడలో అవినీతి, అక్రమాలు చేసిన వారు ఎవరి మెప్పు కోసం కాంగ్రెస్ను విమర్శిస్తున్నారని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గానీ తమ నాయకులను గానీ విమర్శించే వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్నింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, భీమిడి చంద్రపాల్ రెడ్డి, రామిడి శ్రీనివాస్రెడ్డి, దిండు శ్రీనివాస్గౌడ్, బొల్లం కుమార్, భాను ప్రసాద్, నర్సింగ్రావు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తున్న నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్రెడ్డి తదితరులు

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

**ఉప్పల్, మే 17 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ చంద్రకళా నిలయం పేరిణి, ఆంధ్ర నాట్య గురువు సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్లోకం, పుష్పాంజలి, దేవికైవారం, నారాయణతే, నమోనమో, మూషిక వాహన, ఇదిగో భద్రాద్రి, తిల్లాన, మహాగణపతిమ్, కొండలలో నెలకొన్న, సంధ్య తాండవం,ముద్దుగారే యశోధ, సాహిత్య పల్లవి, దశావతరములు అంశాలను కళాకారులు కృతికరెడ్డి, మనోజ్ఞ, వైష్ణవి, అక్షర, ప్రవస్తి, సంజన, హరిణి, మధుప్రియ, రుశ్మిత, దీక్షిత్, అమృతవల్లి, నందిత, భువన, గ్రీష్మ, అమూల్య, హాసిని, తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు దృశ్యం.

## ఘనంగా శ్రీ భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపన



శ్రీ భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 17 ప్రభాతవార్త :** ఉప్పల్ లక్ష్మినారాయణ కాలనీలో శ్రీ అభయాంజనేయస్వామి, రామలింగేశ్వర సహిత సాయిబాబా దేవస్థానంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మినారాయణకాలనీ అధ్యక్షుడు లుకాస్, కాలనీ నేతలు వెంకట్రెడ్డి, నాగేశ్వర్రావు, ఆలయ కమిటి అధ్యక్షుడు నామని నాగరాజు, గౌరవ అధ్యక్షుడు పోన్న యాదగిరి, కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, దూబ కృష్ణ, కోశాధికారి పోచం వేణు, అకారపు అరుణ్ పటేల్, ఉపేందర్రెడ్డి, సత్తిరెడ్డి, సందీప్, భాస్కర్, బ్రహ్మచారి, శ్రీధర్, ప్రసాద్, పల్లె రవిప్రసాద్, దుర్గ ప్రసాద్, రామ్బ్రహ్మం, శ్రీహరి, సురేందర్రెడ్డి, మదర్ వలీ, పూర్ణచందర్రెడ్డి, కృష్ణ, శ్రీనుచారి, లక్ష్మి, పుష్ప, ఉష, ఝాన్సీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : బిజెపి



ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు తెలుసుకుంటున్న బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్ తదితరులు

**ఉప్పల్, మే 17 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మౌళిక సదుపాయాలు కల్పించాలని బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బిజెపి సీనియర్ నేతలు శామీర్పేట ధర్మారెడ్డి, తీగ విఠల్రావు, శ్రీధర్ గుప్త, పంజాల శ్రవణ్గౌడ్, దువ్వాల రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్గౌడ్, పకీర్ నర్సిరెడ్డి, అడెపు రమేష్, నామ శ్రవణ్, ఆకుల రిషికేష్, స్వామి గౌడ్, అనిల్కుమార్ తదితరులతో కలిసి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో జనాభాకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద పేద, మధ్య తరగతి కటుంబాలకు ప్రధాని మోడీ ఆయుష్మాన్ భారత్ పంజకం పెట్టారని,ఉప్పల్ డివిజన్లో వంద పడకల ఆసుపత్రి అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌశీల్యారాణి, ప్రకాష్, పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## చరవాణి వాడొద్దని తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య

**నేరెడ్ మెట్, మే 17ప్రభాతవార్త :** అశ్లీల బొమ్మలతో చరవానిని విరివిగా వాడడం చూసిన తనయుణ్ణి మందలించడం తో కుమారుడు ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్మెట్ సూర్య నగర్ ప్రాంతానికి చెందిన శివరాం వ్యాపారం చేస్తూ భార్యా పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. శివరాం కుమారుడు పాపయ్య 16 ఇటీవల ఇ సి ఐ ఎల్ లో గీతం కాలేజీలో మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. గత కొంతకాలంగా పాపయ్య అధికంగా మొబైల్ ఫోను ను వాడడం తండ్రి గమనించి హెచ్చరించాడు. పాపయ్య తండ్రి మందలింపును విస్మరించి అధిక సమయం చరవాణి తో నే గడుపుతుండడంతో తండ్రి శివరాం గత పది రోజులుగా పాపాయితో మాట్లాడడం మానేశాడు. తండ్రి మాట్లాడకపోవడం తో మానసిక వేదకు గురై శుక్రవారం సాయంత్రం ఇంటి పైన ఉన్న రేకుల రూమ్ లో ఫ్యాన్ కు ఉలివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనయుడు పాపయ్య కనిపించకపోవడంతో తల్లి రెగ్యులర్ రూమ్లో చూడగా పాపయ్య ఫ్యాన్కు ఉరి వేసుకొని వేలాడుతున్నాడు. వెంటనే పాపయ్యను స్థానిక ఆస్పత్రికి తరలించిన ఫలితం లేకపో వడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రిస్టియన్ కాలనీలో వరదనీటి సమస్యకు పరిష్కారం



మధుయాష్కీ, వెంకటేశ్వర రెడ్డి లను సన్మానిస్తున్న క్రిస్టియన్ కాలనీ ప్రతినిధులు.

**వనస్థలిపురం. మే.17.ప్రభాతవార్త.**
వనస్థలిపురం క్రిస్టియన్ కాలనీలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారితో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ, చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు పర్యటించారు. క్రిస్టియన్ కాలనీలో గతంలో తీవ్ర వరద నీటి సమస్య ఉన్న నేపథ్యంలో 3 నెలల కిందట మధుయాష్కీ గారు స్వయంగా వచ్చి పరిశీలించారు. కార్పొరేటర్ వెంకటేశ్వర రెడ్డి గారికి సహకారం అందించి నాలా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. ఈ క్రమంలో నెలల వ్యవధిలోనే నాలా పనులు పూర్తి చేసి సీసీ రోడ్డు కూడా నిర్మించడం జరిగింది. కాలనీవాసుల ఆహ్వానం మేరకు మధుయాష్కీ సదరు కాలనీని సందర్శించారు. తమకు వరదనీటి సమస్యను తీర్చినందుకు కాలనీవాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. మధుయాష్కీ గారికి కార్పొరేటర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కొన్ని వీధుల్లో రోడ్లు, ఇతర చిన్న చిన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని వారిని కోరారు. స్పందించిన మధుయాష్కీ గారు... కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పనిచేస్తున్నారని అభినందించారు. గత పాలకులు ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పనలో విఫలమయ్యారని.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను వెంటనే మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి గారు, మహిళా నాయకురాలు కంచర్ల కవిత, కిరణ్, పాల్గొన్నారు.

## కనుల పండువగా సిద్ధి, బుద్ధి, గణపతి కళ్యాణోత్సవం



సిద్ధి, బుద్ధి, గణపతి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్నగర్, మే 17 ప్రభాతవార్త:**
మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం శ్రీ సిద్ధి, బుద్ధి సమేత శ్రీ లక్ష్మీ గణపతి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. దేవాలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు స్వామి వారి కళ్యాణ వేడుకలను ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి, లక్ష్మీగణపతి ఉత్సవ మూర్తులను పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించిన అనంతరం కళ్యాణ వేదిక వద్దకు మంగళ వాయిద్యాల నడుమ తీసుకువచ్చి కళ్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కళ్యాణాన్ని ఘనంగా జరిపారు. స్వామి వారి కళ్యాణం అనంతరం భక్తులకు విశేష అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తీగల సుభాష్రెడ్డి, కమిటీ సభ్యులు సంతోష్రెడ్డి, అన్నాజీరావు, వెంకట రమణ, వెంకట కృష్ణారావు, రామచంద్రారెడ్డి, శివసాయినగర్ కాలనీ అధ్యక్షుడు పప్పు శ్యామ్కుమార్, బలరామకృష్ణమూర్తి, స్థానిక శివసాయినగర్, టిఎస్ఆర్ నగర్ కాలనీ, బాలాజీనగర్, కేశవరెడ్డినగర్, టిఎస్ఆర్ ఎక్స్టెన్షన్ తదితర కాలనీల ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఆకునూరి మురళికి వినతి



ఆకునూరి మురళికి వినతి పత్రం ఇస్తున్న పారిజాత

**సరూర్నగర్, మే 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రం లోని దావూద్ ఖాన్ గూడలో అసంపూర్తి దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనుల ను పూర్తి చేయించాలని స్థానిక మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కోరారు. ఈ మేరకు ఆమె ఒక వినతి పత్రాన్ని చైర్మన్కు అందజేశారు. ఈ సంద ర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణా న్ని పూర్తి చేయించి వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనం తరం ఆమె విద్యా కమీషనర్ మెంబర్ జ్యోత్స్న శివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఏకా దశదినకర్మ



చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయతంగా పలకరిస్తూ, మంచికి మారు పేరుగా నిలిచి అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి, భగవంతున్ని సన్నిధికి చేరినను మీ మధుర జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలం, మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
శోకతప్తహృదయాలతో....

కీ॥శే॥ బండారి రాజిరెడ్డి గారు
మాజీ మున్సిపల్ చైర్మన్ కాప్రా
మాజీ ఎమ్మెల్యే ఉప్పల్ నియోజకవర్గం, టి.టి.డి మాజీ మెంబర్
జననం : 1947 మరణం : 08-05-2025

భార్య : బండారి వరమ్మ
కుమారులు - కోడళ్ళు : బండారి జగదీశ్వర్ రెడ్డి - రజిత, బండారి జగన్ మోహన్ రెడ్డి - కీర్తి
మనుమళ్ళు : ఆర్యన్ రెడ్డి, మాన్య, శాష
కూతుళ్ళు - అల్లుళ్ళు : జక్కుల వసంత - ఐల రెడ్డి, సి.హెచ్. వనిత రాణి - కీ॥శే॥ వెంకట నర్సింహా రెడ్డి
మనుమళ్ళు : తరుణ్ రెడ్డి, తనయ్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, నిశిత్ రెడ్డి
తల్లి - తండ్రి : కీ॥శే॥ శ్రీ బండారి జంగారెడ్డి - కీ॥శే॥ లక్ష్మమ్మ
తమ్ముళ్ళు : బండారి నర్సింహా రెడ్డి, కీ॥శే॥ బండారి బుచ్చిరెడ్డి
బండారి నీలం రెడ్డి, బండారి వెంకట్ రెడ్డి ,బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు
చెల్లెళ్ళు - బావలు : ఎం. భారతి - కీ॥శే॥ మాదిరెడ్డి బాల్ రెడ్డి, ఎస్. సుశీల - లక్ష్మా రెడ్డి, ఎస్. అనురాధ - లక్ష్మీనారాయణ రెడ్డి

SLMI INFRA PROJECTS PVT. LTD. Above ICICI Bank, Begumpet
జగదీశ్వర్రెడ్డి మెటల్ ఇండస్ట్రీస్, ECIL 'X' రోడ్స్, కుషాయిగూడ, కాప్రా సర్కిల్
ARYAN CONSTRUCTIONS ECIL 'X' Roads
VAISHNAVI & VANSHIKA INDUSTRIES
కార్యస్థలం & తేది : 18-05-2025 (ఆదివారం), బండారి వ్యవసాయ క్షేత్రం, చీర్యాల గ్రా॥ కీసర మం॥లో దశదినకర్మ జరుపబడును.